అదనపు తరగతి గదులు అందని ద్రాక్షేనా.?

- ఏళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు
- నిధుల లేమితో ఆగిపోతున్న వైనం
- వచ్చే విద్యా సంవత్సరానికైనా పూర్తయ్యేనా?

ముస్తాబాద్: కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెబుతున్న పాలకుల మాటలకు, క్షేత్రస్థాయిలో అధికారుల తీరుకు పొంతన కుదరడం లేదు. నిధుల లేమి సర్కార్ బడులకు శాపంగా మారింది. ప్రతిపాదనల సమయంలో వచ్చే నిధులకు పోటీ పడి టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు పైసలు సరిపోలేదని అర్ధాంతరంగా పనులు వదిలి వెళ్లిపోతున్న వైనం విద్యార్థుల తల్లిదండ్రులను ఆవేదన గురి చేస్తోంది. ముస్తాబాద్ మండలంలో వివిధ పథకాల ద్వారా చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు కొలిక్కి రావడం లేదు. వచ్చే విద్యా సంవత్సరం పునః ప్రారంభం నాటికైనా పనులు పూర్తి చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

మూడేళ్లైనా పూర్తికాని పనులు

మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం చీకోడులో డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.34 లక్షలతో జీప్లస్ వన్ పద్ధతితో నాలుగు


మూడేళ్లుగా సాగుతున్న చీకొడు జెడ్పీ పాఠశాల పనులు

అదనపు గదుల నిర్మాణాన్ని మూడేళ్ల క్రితం చేపట్టారు. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. అయితే టెండర్ ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా వచ్చిన నిధులు పూర్తి చేశారు. నిధులు సరిపోలేదని ఆరునెలలుగా పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు.

- ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సరైన గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.
- డీఎంఎఫ్‌టీ ద్వారా బందనకల్‌లో సైతం రూ.34 లక్షలతో అదనపు గదులు నిర్మించి వదిలేశారు. ఈ రెండు పాఠశాలల్లో ఫ్లోరింగ్, కలర్, ఎలక్ట్రిషియన్ పనులు మిగిలి వున్నాయి. అలాగే చీకొడులో తలుపులు, కిటికీలు పెట్టాల్సి వుంది.
- రెండు పాఠశాలలకు రూ.12 లక్షల చొప్పున రూ.24 లక్షల మంజూరు కోసం అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆ నిధులు వస్తే తప్ప మిగిలిపోయిన పనులయ్యే అవకాశాలు కనిపించడం లేదు. రానున్న విద్యా సంవత్సరం పునఃప్రారంభం వరకైనా నిధులు వస్తాయన్న ఆశలు లేవని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు.
- చిప్పలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు గది ఫ్లోరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

శిథిలమైన గదుల్లో..

బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 145 మంది విద్యార్థులు ఉండగా, ఐదు గదులు మాత్రమే ఉన్నాయి. వీటిలో రెండు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ల్యాబ్, కంప్యూటర్, లైబ్రరీకి గదులు లేవు. మరమ్మతుకు చేరుకున్న రెండు గదుల్లో తరగతులు నిర్వహించడం ఆందోళనకు గురిచేస్తోందని విద్యా కమిటీ బాధ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చీకొడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 86 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. మరో గది శిథిలావస్థలో ఉండగా, ల్యాబ్, కంప్యూటర్ గదులు లేవు. ఒకే గదిలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు, ఆఫీస్ రూం నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న నాలుగు అదనపు గదులు అందుబాటులోకి వస్తే గదుల కొరత తీరుతుందని తల్లిదండ్రులు అంటున్నారు. మిగులు పనులకు నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన పూర్తిచేయాలంటున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి



జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు గదుల నిర్మాణం ఆలస్యం అవుతోందని అధికారులకు ఫిర్యాదు చేశాం. కాని వారు మాత్రం నిధులు సరిపోలేదంటున్నారు. మిగులు పనులకు నిధుల మంజూరు ఇప్పించాలని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. కొందరి నిర్లక్ష్యం వల్ల పనులు ఆలస్యమై మెటీరియల్ ధరలు పెరిగాయి.

– పడిగె సవిత, ఎంపీటీసీ

ఇంకెన్ని రోజులు కడతారు



మూడేండ్ల సంది బడి పనులు నడుస్తున్నయి. కాంట్రాక్టర్‌ను అడిగితే పైసలు సరిపోలేవంటున్నడు. పిల్లలు వరండాలో సదువుకుంటున్నరు. ల్యాబ్, లైబ్రరీకి రూములు లేవు. వీటికి రూమ్‌లు లేవని నిధులు ఇచ్చి కట్టిపిస్తే అవి కూడా పూర్తి చేయడం లేదు. పిల్లలు చదువుపై శ్రద్ధ ఎట్లా పెడుతారో పెద్ద సార్లే చెప్పాలి.

–మల్లయ్య, చీకోడు

మిగులు పనులకు ప్రతిపాదనలు చేశాం

చీకొడు, బందనకల్ జెడ్పీ స్కూల్లో మిగులు పనులకు ప్రతిపాదనలు చేశాం. మంజూరు రాలేదు. టెండర్ వర్క్ మేరకు పనులు చేశారు. నిధులు సరిపోలేదు. మిగులు పనుల కోసం రూ.24 లక్షలకు ప్రతిపాదనలు చేశాం. త్వరలో నిధులు వస్తాయి. పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, ఏఈ

క్లుప్తంగా

గోశాలలకు రాజన్న కోడెలు


కోడెలను గోశాలకు అందిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్ గోశాలలోని రాజన్న కోడెలను హన్మకొండ, వరంగల్ జిల్లాలోని గోశాలలకు మంగళవారం అందజేశారు. హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం వంటి మామిడిపల్లి గ్రామానికి చెందిన శ్రీమల్లికార్జున గోశాలకు 20 కోడెలు. వరంగల్ జిల్లా వెలూరు మండలం పీచర గ్రామానికి చెందిన లక్ష్మీ గోశాలకు 20 కోడెలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధోగం


పూజచేస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రేణుక ఎల్లమ్మ సిద్ధోగం కార్యక్రమానికి మంగళవారం కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణుక మాత దయతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, నాగుల విష్ణు, మహేశ్‌గౌడ్, ఎర్రం ఆగయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజులు నియంత్రించాలి



మాట్లాడుతున్న ఎరవెల్లి నాగరాజు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో అడ్డగోలుగా తీసుకుంటున్న ఫీజులను నియంత్రించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎరవెల్లి నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక బీవైనగర్‌లోని పార్టీ ఆఫీసులో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. పర్మిషన్ లేకుండా నడుపుతున్న ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలు అత్యధికంగా ఉన్న జిల్లాలో మెడికల్ మాఫియా ఆస్పత్రులు, మందుల షాపుల్లో సేవాభావం గాలికి వదిలేసి అడ్డగోలుగా దోచుకుంటున్నాయని ఆరోపించారు. సిరిసిల్ల, వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం పేదలకు అందేలా మంత్రి కేటీఆర్ కృషి చేయాలని కోరారు. వైద్యుల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. నాయకులు మల్లారపు ప్రశాంత్, జువ్వాజి విమల, మహ్మద్ అక్రం, సుధీర్ పాల్గొన్నారు.

కల్యాణ వైభోగం


ముస్తాబాద్: మండలం ఆవునూర్, పోతుగల్ గ్రామాలలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాలలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని వేద పండితులు కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గౌతంరావు, బద్దికల్యాణి, జెడ్పీటీసీ నర్సయ్య, పండరి, సతీశ్‌చందర్‌రావు, భాను, విశ్వనాథ్, అశోక్‌రావు, బాలకిషన్, రాజు పాల్గొన్నారు.

పల్లకి సేవ



కోనరావుపేట: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని మామిడిపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం పల్లకీ సేవ నిర్వహించారు. బ్రాహ్మణ సదస్యము, ఎడ్లబండ్లు తిరుగుట, నిత్య హవనం నిర్వహించారు సర్పంచ్ భారత, ఉపసర్పంచ్ రాంరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: మహిళల ఆరోగ్యానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పీఎస్‌నగర్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ఇన్ఫెక్షన్స్, మూత్రకోశ వ్యాధులు, హైపర్ థైరాయిడ్, మధుమేహం, రక్తహీనత, మలబద్ధకం తదితర ఆరోగ్య సమస్యలపై ఉచితంగా పరీక్షలు, చికిత్స అందించబడుతుందన్నారు. భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా భోజన నమూన ప్రణాళిక, ప్రత్యామ్నాయ వంటకాలు, ఆహారం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వీటికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మహిళ కౌన్సిలర్లు అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం విగ్రహావిష్కరణకు తరలిరావాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోనరావుపేట: బహుజన పితామహుడు కాన్షీరాం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ మండలాధ్యక్షుడు కుమ్మరి దేవదాస్ పిలుపునిచ్చారు. కోనరావుపేటలో పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. సుద్దాలలో ఈనెల 8న నిర్వహించే ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఫిట్ ఇండియా ఫౌండేషన్ మండల అధ్యక్షుడు జాషువా, బీఎస్పీ నాయకులు దేవయ్య, శ్రీనివాస్, ప్రశాంత్, బాబు, లచ్చయ్య, ప్రభాకర్, రాజయ్య పాల్గొన్నారు.

మండల సభ్యుల ప్రశ్నల పరంపర

- సమస్యలపై గళమెత్తిన సభ్యులు
- తంగళ్లపల్లి మండల సమావేశం

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ అంశాలలో అధికారులకు ప్రశ్నించారు.

➡ గతేడాది జరిగిన పంట నష్టమే ఇంతవరకు చెల్లించలేదని, ఇప్పుడు మళ్లీ పంటనష్టం అంచనా వేస్తున్నారని చిన్నలింగాపూర్ ఎంపీటీసీ బైరినేని రాము ప్రశ్నించారు.

➡ ఉద్యానవన శాఖ అధికారులు, మండల ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ పడిగెల మానస అన్నారు.

➡ మూడేళ్ల క్రితం ఆయిల్‌పామ్ కొరకు దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇవ్వకుండా నెల క్రితం దరఖాస్తు చేసిన సర్పంచ్ తండ్రికి మంజూరు చేశారని ఎంపీటీసీ రాము ఆరోపించారు.

➡ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల నియామకం చేపట్టాలని ఎంపీటీసీ రాగుల రాజురెడ్డి కోరగా, తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని సర్పంచ్ ముడారి పోచయ్య కోరారు.

➡ అంకిరెడ్డిపల్లెలో ఎక్స్‌ప్రెస్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ రాజురెడ్డి, సారంపల్లిలో వైకుంఠధామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ కొయ్యడ రమేశ్ సెస్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

➡ తంగళ్లపల్లి ఒడ్డెరకాలనీలో ఉంటున్న వారు విద్యుత్ చౌర్యం చేస్తూ ఉపయోగిస్తున్నారని వారికి మీటర్లు ఏర్పాటు చేస్తే సెస్‌కు లాభం జరుగుతుందని ఎంపీటీసీ కోడి అంతయ్య తెలిపారు.

➡ కస్బేకట్కూర్‌లో సీసీ రోడ్లు నిర్మించి డ్రెయినేజీలు నిర్మాణం మరిచారని సర్పంచ్ వల్లకొండ వేణుగోపాలరావు ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు.

➡ గండిలచ్చపేటలో చిరుతపులి వలన భయంగా ఉందని అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య అన్నారు.


సెస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

➡ 2017లో అటవీశాఖకు అప్పగించిన భూములు ఇష్టానుసారంగా కేటాయించారని తన పట్టా భూమి 11 ఎకరాలు సైతం పోయిందని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు సభకు తెలిపారు. రోడ్ల నిర్మాణాలకు అటవీశాఖ సహకరించాలని ఆయన కోరారు.

➡ ఎస్ఎఫ్‌సీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులను ఎందుకు ఫ్రీజింగ్‌లో పెడుతున్నారని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వల్లకొండ వేణుగోపాలరావు ప్రశ్నించారు. ఎంపీడీవో సమాధానమిస్తూ బిల్లుల చెల్లింపు కొరకు ఆన్‌లైన్‌లో కేవలం 10 నిమిషాల సమయాన్ని మాత్రమే కేటాయిస్తున్నారని దీంతో ఆ సమయం సరిపోవడం లేదని మండలానికి రూ.60 లక్షలు బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు.

➡ కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు పెండింగ్‌లో పెడుతోందని దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందని జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు ఆరోపించారు. సెస్ చైర్మన్‌ను సభ్యులు సన్మానించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో పి.లచ్చాలు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, తహసీల్దార్ పి.సదానందం, ఎంపీడీవో పి.లచ్చాలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

షెడ్లు ఏర్పాటుకు స్థల పరిశీలన

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సిరిసిల్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రేకుల షెడ్లు ఏర్పాటు కొరకు మంగళవారం చైర్మన్ బండి దేవదాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. వైస్‌చైర్మన్ వెంకట రమణారెడ్డి, డైరెక్టర్ సత్తు వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని బాబాయి చెరువు తండా గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ భూక్య లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సంతోష్ నాయక్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ ఉద్యోగాన్ని సాధించిన గ్రామానికి చెందిన భూక్య సంధ్యారాణిని సన్మానించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తంగళ్లపల్లి: మండలంలోని శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మంగళవారం ఎర్ర రాజు ఫౌండేషన్ ఆర్గనైజర్ ఎర్ర వినయ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. శంకర్, సుమన్, నవీన్, హరీష్, రజినీకాంత్, రాజు, ప్రశాంత్, పరమేశ్, భాను పాల్గొన్నారు.

శిక్షణతో మహిళలకు ఉపాధి

ఎల్లారెడ్డిపేట: ఫ్యాషన్ డిజైనింగ్, అల్లికలు, కుట్ల శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు ఆర్థిక సాధికారత వైపు అడుగులు వేయాలని అన్నారు. మండలంలోని రాజన్నపేటలో మంగళవారం మహిళల సంఘాలతో సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నాబార్డ్ అధికారులు రుణాలతో ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. అలాగే గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణలో ముందుండి వాటి ద్వారా సేంద్రియ ఎరువుల తయారీలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి రవి, ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కు వితరణ



వీర్నపల్లి: గత సంవత్సరం గుండెపోతుతో మృతిచెందిన స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ బొప్పాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ బోడ జగన్ కుటుంబానికి రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును గ్రామ సర్పంచ్ పాటి దినకర్, సెస్ డైరెక్టర్ మల్లేశం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయిని రవి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కళ, యూత్ అధ్యక్షుడు సామల్ల దేవరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎండి రఫి, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌నాయక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని విశ్వభారతి పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని నక్షత్ర తెలంగాణ స్టేట్ లేవల్ కుంగ్‌ఫూ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రస్థాయిలో మెదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రేగులపాటి రవిచందర్‌రావు అభినందించారు.

ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. పాత బస్టాండ్‌లో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. తాగి వాహ నాలు నడిపితే జైలు శిక్ష తప్పదని అన్నారు. చిన్న పిల్లలకు వాహ నాలు ఇవ్వొద్దని అన్నారు.

పాఠశాలలో బోరు ఏర్పాటుకు సాయం

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంపీపీఎస్ నెహ్రూనగర్‌లో బోరు మోటర్ వేసేందుకు వెల్ది హరిప్రసాద్ రూ.25 వేలు, ధ్యావనపెల్లి మురళి రూ.11 వేలు అందించినట్లు ప్రధానోపాధ్యాయులు గణేశ్ తెలిపారు.

యోగా టీచర్‌కు సన్మానం

సిరిసిల్లఅర్బన్: జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ ప్రభుత్వ పాఠశాల యోగా టీచర్ తిప్పరవేని స్వప్నను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి, తిప్పాపూర్ గ్రామాల్లో హరిత నర్సరీలను ఏపీవో చంద్రయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే జూన్ చివరి నాటికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని, వేసవికాలం అయినందున మొక్కలు ఎండిపోకుండా రోజుకు రెండుసార్లు నీరు పట్టాలని నిర్వాహకులకు సూచించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వీర్నపల్లి: మండలంలోని బాబాయి చెరువు తండా గ్రామ పంచాయితీ పరిధిలోని మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు, మండల ప్రధాన కార్యదర్శి రఫి, మండల నాయకులు మాలోత్ సంతోష్ నాయక్, ఎఫ్ ఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు అమలు చేయాలని వినతిపత్రం

ఇల్లంతకుంట: మానకొండూర్ నియోజకవర్గంలోని దళితులందరికి దళిత బంధు పథకం అమలు చేయాలని బీజేపీ దళిత మోర్చా నాయకులు మంగళవారం తహసీల్దార్ రవికాంత్‌కు వినతిపత్రం అందజేశారు. అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, స్వామి, సంపత్, రజినికాంత్, అనీల్, అఖిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నియామకం

మారసం కార్యవర్గం

సిరిసిల్లకల్చరల్: మానేరు రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా టీవీ నారాయణ, ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. అలాగే సహాధ్యక్షురాలుగా డాక్టర్ కందేపి రాణీ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా గెంట్యాల భూమేశ్, బూర దేవానందం, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడిగా చిటికెన కిరణ్‌కుమార్, కోశాధికారిగా జిందం అశోక్, నిర్వాహక కార్యదర్శులుగా గోనె బాల్‌రెడ్డి, డాక్టర్ వడ్డెపెల్లి సంధ్య, సంయుక్త కార్యదర్శులుగా తిరుమల జగన్నాథాచార్య, డాక్టర్ అర్జున్, ప్రచార కార్యదర్శులుగా మోత్కుల నారాయణ, తిగుళ్ల శ్రీకాంత్ శర్మ, మహిళా విభాగం కన్వీనర్లుగా జి. శ్రీమతి, మాడూరి అనిత, దీపిక, సిరిసిల్ల చందన, తాళ్లపల్లి భాగ్యలక్ష్మి, యువ కార్యదర్శులుగా ఈడెపు సౌమ్య, అంకారపు రవి, సుమన చక్రవర్తి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

సమాచారం

10న వేలం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని పశువుల అంగడికి 2023-24 సంవత్సరంకు గాను ఈనెల 10న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 10 లోపు రూ. 2 లక్షల డిగ్రీతో పాటు రూ.5 లక్షల సాల్వెన్సీ సర్టిఫికేట్‌ను జత చేసి పురపాలక సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు.

చింతాల్‌ఠాణాలో పోషణ మేళా


చింతాల్‌ఠాణాలో పోషణ మేళా

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతాల్‌ఠాణా గ్రామంలోని రైతు మార్కెట్‌లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులకు పోషణ విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎల్లయ్య, సుధారాణి, సర్పంచ్ రేగులపాటి రాణి, సూపర్ వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బ్యాంకుల భద్రతపై ఆరా


బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎస్సై

గంభీరావుపేట: మండల కేంద్రంలోని వివిధ బ్యాంకులను ఎస్సై మహేశ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. బ్యాంకుల్లో భద్రత చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్లతో బ్యాంకుల్లో రక్షణ చర్యల గురించి చర్చించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట: ఇంటింటికి బీజేపీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బరకం నవీన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 14 వరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మండల అధ్యక్షుడు బొమ్మడి స్వామి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లి వేణు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని భారతి విద్యానిలయంలో పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా న్యాయవ్యవస్థపై, బాలల హక్కులు, రక్షణ చట్టాల గురించి వివరించారు. రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ జాగీరు శైలు, నేరేళ్ల శ్రీకాంత్, అగ్గిరాములు, కొమిరే సంజీవ్, పాఠశాల కరస్పాండెంట్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.